కథ

మార్చి నెల మొదటివారమే అయినా ఎర్రటి ఎండ నిప్పులు కురుస్తున్నట్లున్నది. అప్పుడప్పుడూ ఎక్కడో ఒకచోట పొలాల్లో రైతులు ఎద్దులను అదిలిస్తున్న చప్పుడు తప్ప వాతావరణం నిశ్శబ్దంగా గంభీరంగా ఉంది. అది బస్సులు పొయ్యే మట్టిరోడ్డు. అక్కడక్కడ కంకరదేలి గుంటలు పడి ఉంది. చిన్న బోర్డుమీద బండ్లగూడెం అని వ్రాసి బాణం గుర్తు వేసి ఉంది పడమటి దిక్కు చూపిస్తూ. బస్ షెల్టర్ అయితే లేదు గాని ఓ చింతచెట్టు కింద నాలుగైదు బండపరుపు రాళ్లున్నాయి. ఎండ నడినెత్తిమీదకు వచ్చిందేమో.... నీడ గొడుగులా చెట్టుకిందనే పరుచుకొని వుంది. రోడ్డుమీదున్న చెట్టు కావడాననేమో వనగాయలప్పటి నుండి ఎవరు బడితే వాళ్లు తెంపుకబోతుండబట్టి చెట్టుమీద కాయలు లేవు. మ్యాకలకు మందలు నరకబట్టి చెట్టు మొండిబారి ఉంది. చెట్టుకింద కూర్చున్న పోశవ్వ కండ్లల్ల వత్తులేసుకొని బాటెంట చూస్తున్నది.

# తిరుగు ప్రయాణం

జి. అనసూయ



ఊర్ల నుంచి వచ్చిన లింగయ్య పోశవ్వను జూసి "ఏందే ఈడున్నవ్ ఊరికిగిట్ల పోతున్నవా," అంటూ పలకరించిండు.

ఏ ఊరికి పోతరా.... ఇంగ కాటికి పొయ్యేడిదె మిగిలింది అన్నది పోశవ్వ.

మరేందే పొద్దుగాలొచ్చి కూసున్నవ్ ఎవల్లన్న వస్తున్నరా.

నా కొడుకులు, మనవలు వస్తరేమోరా పండుగకు గండుకే సూస్తన్న అన్నది పోశవ్వ.

యాదన్న, రాజన్న పట్నపుల్ల ఏడుంటరే అన్నడు లింగయ్య పక్కనే ఉన్న రాయిమీద కూసుంట.

రెండు బస్సులు వచ్చి పోయినయే. ఒకరిద్దరు ఊరోళ్లు బస్సు దిగి పలకరించుకుంట పొయ్యిండ్రు.

పొద్దున నుండి ఏం తినలేదు. పేగులు అరుస్తున్నయి. నాలిక తడారిపోతున్నది. ఇయల్లగూడ రాలేదు. రేపే పండుగ ఒకరుగాకపోతే ఒకరన్న రాలె. పొద్దుమూకల బస్సుకన్న వస్తరో రారో.... అనుకుంట ఊరిదారి పట్టింది పోశవ్వ. వంగిన నడుము, కర్ర ఊతంతోని నడుస్తున్నది. అయిదేండ్లాయె. ముగ్గురు కొడుకులు తలో దిక్కుకు పొయ్యి పెద్దోడు గాడేడ్నో కట్టపనికి పోతున్న అన్నడు. సన్న పిల్లల తీస్కోని పొయ్యిండ్రు ఇద్దరు ఆలుమగలు. నడిపోడు పట్నముల్ల మేస్త్రికింద జేస్తున్నడంట. చిన్నోడు పెండ్లి గాంగనే పొయ్యిండు. బొంబాయిల గదేందో పాక్టరిల చేస్తున్నడంట. ఆడ్నె కొడుకు పుట్టిండు. ఏడాది పిల్లగాడయినంక ఒక్కసారి వచ్చిండ్రు. రెండేండ్లాయె ఎవ్వరు ఊరిమొగమే జూస్తలేరు. పెద్దోని బిడ్డ పెద్దమనిషి అయ్యిందంట. ఎట్లున్నరో ఎందో కానని రాజ్యముల్ల.... బిడ్డలు పొట్ట చేతపట్టుకొని దేశదేశాలు తిరుగవట్టిరి. ఈడ వానలు లేక ఎగుసాలు సాగక కూల్లుకూడ దొరకకుండాయె. వయసు పిలగాండ్లు ఊర్ల ఉంటె తాగుడుకు తిరుగుడుకు మరిగి ఇజ్జత్ దీస్తరని ఏడికన్న పొయ్యి బతుకుండ్రి కొడుకా.... అని తనే చెప్పింది. చిన్నోనికి ఆత్రం ఎక్కువ. ఈడున్నన్నాల్లు అందరికండ్లు వానిమీదనే. ఎలక్షన్లప్పుడు అన్ని జండలోల్లు వీరన్న, వీరన్న అనుకుంట వాన్ని ఇంట్ల నిమిషం ఉండనిచ్చెటోల్లు కాదు.

"ఎందుకురా, వీరన్న గాతిరుగుళ్లు..." కూడు వెట్టేవా గుడ్డవెట్టావా అని మొత్తుకున్నా ఇనెటోడెగాదు.

కండ్లల్ల మెదిలినట్లె ఉంది వాని రూపం. వాని కొడుకు కూడ అచ్చం వాని నోట్ల నుంచి ఊసి పడ్డట్లె ఉన్నడు. తెల్లగ గుమ్మడి పండోలె. వచ్చుకం వచ్చుకం రెండు చేతులు జాపి అల్లుకున్నడు. మా నాయిన నిండు నూరేండ్లు బతుక.

వాని పెండ్లంపోరి కూడా మంచిదే.

అత్తమ్మ. ఇగో నీకు చీర తెచ్చిన అని అంచు చీర తెచ్చింది. నాకెందుకే గంత మంచి చీర మీరు పట్నముల్ల ఉండెటోల్లు మీరు కట్టుకోవాల జర మంచి బట్టలు. నాదేముంది ఏ పాతగుడ్డ కట్టుకున్న కాలమెల్లి పోతది. అంటున్నా ఇనకుండ. కొత్తచీర కట్టిచ్చింది. ఉన్న నాలుగు దినాలు పనంత తానే జేసి కంచముల్ల పెట్టి ఇచ్చింది. పిలగానికి ఇత్తమంటె చేతుల ఏం లేకపాయె. చేతులకున్న ఎండి మురుగులు చెడగొట్టి మొలతాడు జేపిచ్చిన. బాలకృష్ణనోలె ఎంత ముద్దుగున్నడో నా నాయిన. నా దిష్టే తగిలెటట్లున్నది. చిక్కుపడ్డ దారపుండలా ఎడతెగని ఆలోచనలు ముసురుతుండగా ఇల్లు జేరింది పోశవ్వ.

రాత్రి అన్నం ఉంది గిన్నెల. ఇం[illegible] పచ్చడేసుకొని తిని చెంబెడు నీళ్లు తాగి యాపచెట్టు అరుగుమీద బొంత పరుసుకొని పండుకొన్నది. ఎట్ల పట్టిందో నిద్ర. లేసేటప్పటికి పొద్దు మూకుతున్నది. బస్సు వచ్చి పొయ్యినట్లుంది. బాట దిక్కు జూసింది. ఎవ్వరు వస్తలేరు. ఊరంతకు పండుగ తనింట్ల మాత్రం చచ్చిన పీనిగలాగ తను ఒక్కతె. ముగ్గురు కొడుకులుండిగూడ దిక్కులేని దాన్లాగ, పోశవ్వకు దుఃఖం ఆగలే. కండ్లనీళ్లు తుడుసుకుంట లేసి గడపముందర పిల్లలను పొదుముకొని కూసున్న కోడిపెట్టను గంపకింద కమ్మింది అన్నం గూడ వండబుద్దికాలె. ఇన్ని మంచినీళ్లు దాగి అట్లనే పండింది. నిద్రరాలె. అట్లనే ఇంటి పైకప్పు వైపు జూసుకుంట తెల్లార్లు గడిపింది.

కొడుకులంత తలోదిక్కు పొయ్యినంక పోశవ్వ కూలినాలి జేసుకునుకుంట ఊర్లనే ఉన్నది. రెండెకరాల చెల్కయితె ఉత్తిగాని వానల్లేక.... ఏం ఎయ్యలె. రెండర్రల ఇల్లుండె ఎండకు వానకు సదరిచ్చిటోల్లు లేక ఒక అర్ర ఆసాంతం కూలి పొయ్యింది. ఉన్న ఒక్క అర్రల ఎట్లనో కాలం గడుపుతున్నది. వానొస్తె అంత కురుస్తది. జర కష్టం సరి జేపిద్దమంటె చేతుల పానం లేకపాయె. కొడుకులు ఎప్పుడన్న ఒకసారి వచ్చినప్పుడు పందో రెండొందలో ఇస్తరు. తను ఒకటో రెండో కోడిపిల్లలను సాదతది.

ఊర్ల ఒక్కదానివి ఏం ఉంట మాకాడికే రారాదే అన్నరు కొడుకులు కాని.... వాల్లె ఇల్లు ఇడుపులేక దేశాలమీద పోతే తను బొయ్యి ఏడుంటది. ఎంతైనా ఇది తన ఊరు. ఎప్పుడు పదేండ్ల పిల్లప్పుడు పెండ్లయి ఈ ఊర్ల కాలుపెట్టింది. కష్టమో, సుఖమో.... ఈడ్నె తనువు రాలాలె. ఏ నడరాత్రో పానం పోతె.... అయినా ఊర్ల మనుషులు లేరా.... పారెయ్యనీక.

"ఒస్తా ఒక్కడ, పోతా ఒక్కడ...." బ్రహ్మం గారి తత్వం గుర్తొచ్చింది పోశవ్వకు.

తెల్లారకముందే లేచింది పోశవ్వ. వాకిలి ఊడ్చి, సానిపిజల్లి, గడపలు కడిగి ఇడుపులు అలికి ముగ్గు పెట్టింది. అంతట్లనే వచ్చిండు అంజయ్య.

బాగున్నావె.... అనుకుంట.... వరుసకు మేనల్లుడు.

బాగనె ఉన్న నాయిన. ఎప్పుడొచ్చినవ్ నిన్న పొద్దు పొయ్యేదానిక బస్సుకాడ్నె కూసున్న.... మా యాదయ్య కలిసిండా పిల్లలు గిట్ల బాగున్నరా ఆత్రంగ అన్నది పోశవ్వ. యాదయ్య, అంజయ్య పట్నముల్ల ఒక్కకాడ్నె ఉంటరంట.

ఆ.... అంత బాగనే ఉన్నరే. పండుగకు సెలవులు ఇయ్యలె. అందుకే యాదయ్య బావ రాలె. ఇగో ఈ పైసలు పంపిండు. నిన్ను జర పైలంగ ఉండమన్నడు. ఎండకాలముల్ల వచ్చిపోతనన్నడు. జేబులనుండి పదిరూపాయల కాగితాలు పదితీసి

## భారీ తేలు

మనిషికన్నా ఎత్తుగా భారీగా ఉన్న సముద్రపు తేలుకు సంబంధించిన శిలాజాన్ని పశ్చిమజర్మనీలోని ప్రెం పట్టణం సమీపంలో తవ్వకాల్లో కనుగొన్నారు. శాస్త్రీయ పరిభాషలో 'జాకెలోప్టరస్ రెననై' గా పిలిచే ఈ తేలు సుమారు 460-255 మిలియన్ సంవత్సరాల క్రితం జీవించింది. దీని పొడవు దాదాపు 2.5 మీటర్లు (8.1 అడుగులు). ఇప్పటివరకు లభించిన జీవరాశుల శిలాజాల్లో ఇదే అతిపెద్దది. ఈ తేలుకొండి ఏకంగా 46 సెంటీమీటర్ల (18.4 అంగుళాలు) పొడవుంది. ఈ భారీ తేలు ఆరుకాళ్లపై నడిచేది. జతగట్టేందుకు సముద్రం ఒడ్డున భారీసంఖ్యలో గుమికూడే సందర్భంలో పరస్పరం చంపి తినే లక్షణమూ వీటి సొంతమట ! ఈ తేలు ఫోటోను బ్రిస్టల్ యూనివర్శిటీ విడుదల చేసింది.

లెక్కపెట్టి ఇచ్చిండు. కండ్లల్ల నీళ్లు తిరుగుతుండగా తీసుకున్నది పోశవ్వ.

పోన్లె నాయిన ఏడుంటె ఏంది సల్లగ బతుకుతె సాలు. నీవు పొయ్యే టప్పుడు జర ఈడంగ వచ్చిపో.... పిల్లలకు జరన్ని కారపప్పులు జేసిస్త బ్రతిమాలింది పోశవ్వ.

"అట్లనే వస్తలేవే... ఇంగ మరి నేను పొయ్యొస్త", అంటూ లేచిండు. పోన్లె రాను పోను ఖర్చులు మాత్రం ఊకయితవా, యాడ్నో ఓకాడ మంచిగుంటె సాలు. మనసులోనే దేవునికి దండం పెట్టుకొని డబ్బులు తీసి, గూట్ల చిన్న పెట్టెల పెట్టింది.

పిల్లలొస్తరని బియ్యం పిండి పట్టించి పెట్టింది. అందుకనే అంటరేమొ "ముందుగ మురిసినమ్మ పండుగ ఎరుగదని', అనుకుంట ఇంత పిండి కలిపి రొట్టెలు జేసింది. ఇంటెనుక ఆనగం కాయలు కాస్తున్నయి, ఆల్లకు వీల్లకు ఇయ్యంగ మిగిలిన లేతకాయ ఉంటె తెంపి వండింది. తిందమని కూచుంటె నోట్లకు పోలె. పిల్లలు యాదికొచ్చి మనసంత దిగులుతో నిండిపోయింది.

అడుగుల చప్పుడు ఇనిపిస్తె బయటికి వచ్చి చూసింది. ఉత్తరాలు తెచ్చె కాశయ్య.

నిన్ననే ఈ ఉత్తరం వచ్చింది. పొద్దు పొయ్యిందని నిన్న రాలె. అంటూ ఉత్తరం ఇచ్చిండు.

చిన్నోడు బొంబాయి నుంచి రాసిండు.

జర సదువు నాయనా అంటూ బతిమాలింది కాశయ్యను.

"అంత బాగున్నరంటనే పండుగకు వస్తలేము ఎండకాలంల వచ్చి పదిరోజులుంటమని. నీవు బద్రంగ ఉండు. పండుగెల్లినంక పైసలు పంపిస్త అంటూ రాసిండు.

ఆ ఆశ కూడ పొయ్యింది. ఇంక నడిపోడు ఒక్కడు ఇయ్యాలనన్న వస్తె బాగుండె. ఒక్క పండుగకన్న అందరు పిల్లలు వస్తె మనువల మనవరాల్లతోని నిండుగ ఉండాలని కొట్టుకుంటుంది ప్రాణం. తనకా రాతలేదు. ఇంత రొట్టెదిని సాకలి ఈరన్న ఇంటికి వెల్లింది పోశవ్వ. ఈరన్న తన నడిపోడు ఉండెకాడ్నె ఉంటడు. ఈరన్న తల్లి ముత్తమ్మ రొట్టెలు చేస్తున్నది. పోశవ్వను చూడంగనే,

రా అత్తా... ఈరన్న పటేలు ఇంట్లకు ఫోను జేసిండే. పండుగకు ఎక్కువరోజులు సెలవులు లేవంట. వస్తలేమని చెప్పిండు. రాజయ్య కూడ నీకు చెప్పమని చెప్పిండంట. అంత బాగున్నరు. నీవు ఫికరు జెయ్యకని చెప్పిండంట.

ఏవుండే ఫికరు జెయ్యనీక.... పిల్లలు వస్తరేమో అని ఆశపడ్డ పెద్దోడు చిన్నోడు కూడ వస్తలేరు. వీడు కూడ రానన్నడు నాదేం వుంది ఎట్లనన్న పొద్దు గడిచిపోతనే ఉంది కండ్లల్ల నీళ్లు

## గ్రంథాలయం

అదొక క్రొత్త ప్రపంచం
జ్ఞానులను సమీకరించే ప్రపంచం
అజ్ఞానం పారద్రోలి
విజ్ఞానం పంచి ఇచ్చే
సుజ్ఞాన ప్రపంచం
మాటా మంతీ లేకున్నా
ఒక్కడైనా, ఎప్పుడయినా
విసుగనేది లేకుండా గడపగలిగే
ఒక వింత ప్రపంచం.
మాటల తూటాలు లేకుండా
కాకా బాకాల పని లేకుండా
ఒకరికొకరు పరిచితులు కాకున్నా
కలసి మెలసి మనగలిగే
అందమైన ప్రపంచం
బీదా గొప్ప తారతమ్యం లేకుండా,
ఆకలి దప్పులను మరపించే ప్రపంచం
ఎల్లలు దాటి ఉన్నవారిని
కూడ ఎల్లవేళలా గురుతు తెచ్చే ప్రపంచం
లోకంలోనే ముచ్చటైన ప్రపంచం
అదే పుస్తక ప్రపంచం, అక్షర ప్రపంచం
అందుకు ద్వారమే
పుస్తక గ్రంథాలయం
సాహితీ ప్రియులకు
ప్రియమైన ఆలయం.

**- ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి**

వత్తుకుంట అన్నది పోశవ్వ పండుగెల్లినంక ఓ సారి నేనే పొయ్యి అందర్ని చూసొస్త అనుకున్నది మనసులో.

ఒక్కసారి పొయ్యి కొడుకులు ఎట్లెట్ల బ్రతుకుతున్నరో జూసి రావాలని మనసున బడ్డది మొదలు... అన్ని సరుదుకోవడం మొదలుపెట్టింది పోశవ్వ. కోడి పిల్లలను అయినకాడికి అమ్మింది. ఇంట్ల ఇన్ని బియ్యం, జొన్నలు ఉంటె అన్ని బస్తలల్ల బోసి మరుదుల ఇండ్లల్ల పెట్టింది. ఉన్న నాలుగైదు గిన్నెలు, తప్పాలలు మూటగట్టి మేనకోడలి ఇంట్ల బెట్టింది. పిల్లలకని ఇన్ని మదుగుబూలు, కారపప్పులు చేసి చెయి సంచిల పెట్టుకుంది. అందరికి చెప్పి, ఇల్లు తాలం బెట్టి పక్కనున్న రాములమ్మకు జర ఇల్లు వాకిలి జూస్తుండమని చెప్పి, అడ్రసు కాగితం బద్రంగ చెక్కుడు సంచిల పెట్టుకొని బయలుదేరింది పోశవ్వ.

బస్సు ఎక్కి రైలు స్టేషనుకు చేరుకున్నది. సాయంత్రం ఆరు గంటలకు ఉందన్నరు రైలు. ప్లాటుఫాం మీదనే ఓ మూలకు స్తంబానికానుకొని కూర్చున్నది, వెంట ఉన్న సంచిని జాగ్రత్తగ ఒళ్లో పెట్టుకొని, అయిదు కావస్తుండగ టికెట్లిస్తరంటె వెళ్లి క్యూల నిలబడ్డది. తోసుకుంట తొక్కుకుంట గంటసేపటికి టికెట్ దొరికింది. ఆ ఊరిపేరు పలుకరాలేదు. అడ్రసు చిట్టిచూపిస్తె టికెట్టు ఇచ్చిండు.

ఏ పెట్టెల ఎక్కాల్నో తెల్వలేదు. ఉరుక్కుంట పొయ్యి గాడ నల్లబట్టలాయిన చూపించిన పెట్టెల ఎక్కింది. అంతట, మూటలు, ముల్లెలు, పిల్లలు, ముసలోల్లు కాలుపెట్టనీక సందులేదు. ఒకరిమీద ఒకరు కూసున్నరు నిలబడనీక కూడ జాగా లేదు. చుట్ట వాసన, బీడీల వాసన. సన్న పిల్లల ఏడుపులు, రణగొణ ధ్వనులు. ఎట్లనో ప్రాణాలు వుగ్గ పట్టుకొని ఓ మూలకు కూర్చున్నది పోశవ్వ. తెల్లవార్లు ప్రయాణం ఎక్కేటోల్లు, దిగెటోల్లు లొల్లి లొల్లి పదకొండు అవుతుండగా తను దిగవలసిన స్టేషను వచ్చిందన్నరు. మెల్లిగ సంచి పట్టుకొని దిగింది. రైలు కదిలి వెళ్లిపొయ్యేదాక అట్లనే జూస్తా నిలబడ్డది.

టేషన్ బయటకు వచ్చింది. అడ్రసు కాగితం చూపించి ఓ అయ్యను అడిగింది.

"ఈ రోడ్డెంట ఇట్లనే పోతె ఊరొస్తది. బస్టాండుకు పొయ్యి క్యాంపుకాడికి పొయ్యే బస్సు ఎక్కు గంట గంటన్నరల నీ కొడుకు ఉండెకాడికి పోవచ్చు" అన్నడు ఆ పెద్దమనిషి.

"మా నాయిన సల్లగుండు" అని ఆయనను దీవించి ఊరి బాట పట్టింది పోశవ్వ. ఎండ పెల్లుమంటున్నది. ఒళ్లు తూలినట్లనిపించింది. ఎట్లనో బస్టాండు చేరుకున్నది. ఆ దినం ఏదో బందంట. బస్సులు నడుస్తలేవు. అట్లనే బస్టాండులో బెంచిమీద పండుకొన్నది. తెల్లారి లేచి అడ్నే ఉన్న

నల్లకాడ మొకం కడుక్కున్నది. అంతలోకి బస్సు వచ్చిందన్నరు. ఏడున్నరో జనం బస్సు నిండ తయా రయ్యింగ్రు. కూచునే చోటు లేక నిలబడ్డరు. బస్సు నిండు చూలింతలాగ కదల్లేక కదిలింది. క్యాంపు కాడికి పొయ్యేసరికి పొద్దు నెత్తిమీదకొచ్చింది. వాళ్లను వీళ్లను అడుక్కుంట కొడుకు రికాన కాడికి పొయ్యే సరికి పొద్దు వాలింది. కొడుకు ఉన్నది ఇల్లూ కాదు గుడిసే కాదు. గుడ్డలతో పాత అట్టలతో కట్టిన డేరా. కొడుకు కోడలు ఇద్దరు పనికి పోగా పిల్లలిద్దరు ఉన్నరు. పెద్దపిల్ల అంట్లు కడుగుతున్నది నీల్లతొట్టికాడ. పిలగాడు మట్టిల ఆడుతున్నడు. రెండేండ్ల తరువాత చూసింగ్రేమో పిల్లలు గుర్తుపట్టలేదు. కొంచెంసేపు చూసి గుర్తుపట్టి దగ్గరకొచ్చి అల్లుకున్నరు. పిల్లలిద్దరు బక్కగ చిక్కిపోయి మొఖాలు వేలాడేసుకొని ఉన్నరు. సంచిలనుండి కారపప్పులు తీసియ్యగానే విప్పారిన మొఖాలతో తీసుకున్నరు.

తల్లి వచ్చిందని ఎవరో చెప్పగా కొంచెం తొందరగానే వచ్చిండు కొడుకు కోడలు. పొద్దున తొమ్మిది గంటల్నుండి సాయంత్రం వరకు వంచిన నడుము ఎత్తకుండ మట్టిమోసి మోసి పదేండ్లు పైన పడ్డట్లు అయ్యిండు కొడుకు కోడలు నీరసంగ పాలిపోయిన మొహంతో దిగాలుగ ఉంది.

"ఇంత దూరం ఎట్లొచ్చినవ్ అత్తమ్మా ! ఏమన్న తిన్నవా...." అంటూ అన్నం పొయ్యి మీద పెట్టింది.

"ఎట్లనో వచ్చిన్నే... పండుగకు మీరొస్తరను కుంటె రాకపోతిరి. పిల్లలు కండ్లల్ల మెదుల్తున్ని. ఎట్లనన్న పొయ్యి చూసొద్దమని వచ్చిన" అన్నది పోశవ్వ.

వారం దినాలు పిల్లలతోని గడిసిపొయి నయ్. వాళ్ల బ్రతుకులు వాళ్లు ఎట్లనో ఈడుస్తున్నరు. ఈడ కూసోనీక జాగ లేదు. పండనీక జాగలేదు. ఇంగ పోయి నడిపోన్ని చిన్నోన్ని గూడ చూసొస్తె నేను బతికినా సచ్చినా ఫికర్లేదు అనుకున్నది పోశవ్వ.

"ఈడ్నె ఉండరాదె ఒక్కదానివి ఊర్ల ఏముంటవ్" అన్నడు కొడుకు కాని బలవంతం చెయ్యలే. పచ్చటి పొలాల మధ్య... పదిమంది జనం మధ్య మెలిగిన తన తల్లి ఈ మట్టిగుట్టలల్ల యేముం టదని అనుకున్నడో ఏమో !

టేషన్కొచ్చి టికెట్ కొనిచ్చి రైలెక్కిచ్చిండు. కోడలు రైల్ల తిననీక సద్ది గట్టి ఇచ్చింది. అద్నుంచి నడిపోడికాడికి రెండు రైళ్లు మారాలట. బెజవాడల దిగి చిట్టి చూపిస్తే మల్ల ఎక్కవలసిన రైలు చూపిస్తరని చెప్పిండు కొడుకు.

పిల్లలు వెక్కి వెక్కి ఏడ్చింగ్రు వస్తుంటె. పోశవ్వకు దుఃఖం ఆగలేదు. రైలు కదులుతుంటె కొడుకు కండ్లల్లో తడి. రుమాలు తీసుకొని మొఖం తుడుసుకున్నట్లె కండ్లు తుడుసుకున్నడు. రైలు కదిలినాక పోశవ్వ కండ్లల్ల నీళ్లు కట్టలు తెంచుకున్నవి. ఈసారి కూచోనీక జర జాగ దొరికింది. రాత్రి పగలు రైల్ల ఎట్ల కూసున్నదో ఎట్ల పండిందో తెల్వదు. ఎట్ల రైలు మారిందో తెల్వదు. మూడోదినం పట్నం చేరింది. అడ్రసు కాగితం పట్టుకొని ఆ అయ్యను ఈ అయ్యను అడుక్కుంట బస్సెక్కి రిక్షా ఎక్కి కొడుకుండే బస్తీకి చేరింది. ఇంట్ల పిల్లలే ఉన్నరు. ఇల్లుకాదు నాలుగు వైపుల నాలుగు రేకులు పెట్టి పైనో రేకు కప్పిన రేకుల డబ్బా.

"అమ్మ నాయిన దవఖానకు పొయ్యింగ్రు" అయిదేండ్ల మనవడు చెప్పిండు. చుట్టుపక్కల కూడ ఎవరు పెద్దోల్లు కనిపించలే. పిల్లలే మట్టిల పొర్లు కుంట దొర్లుకుంట ఆడుతున్నరు.

ఓ గంట పోయినంక వచ్చింగ్రు కొడుకు, కోడలు.

ఏందిరా గట్ల పరిశానుగున్నరు. దవా ఖానాకు పొయ్యింగ్రంట అన్నది పోశవ్వ.

"ఏం లేదే మాతోని మేస్త్రీ పనిచేసే సాయన్న పదో అంతస్తు మీదనుండి పడి మెదడు చిట్లి ఆడికాడ్నె సచ్చిండు. పోస్టుమార్టం చెయ్యనీక దవకానకు తీస్కపొయ్యింగ్రు. ఓనరు నాకేం దెల్వదు అతనే కండ్లు తిరిగి సొలిగి కిందపడ్డడు" అంటు న్నడు. యూనియనోల్లు అయిదులక్షలు ఇయ్య మంటున్నరు. వానికిద్దరు చిన్నచిన్న పోరగాండ్లు భార్య మల్ల కడుపుతోని ఉంది.

"పదో అంతస్తు మీదికెల్లి పడ్డడా. ఊరు గాని ఊర్ల ఇంత ఆపద వస్తే...అదే తన బిడ్డకేమన్న అయుంటె" పోశవ్వ గుండె బద్దలయింది. ఆ ఆలోచనకే. మూడు దినాలు గా పరేశాన్లనే గడిసి పోయినయే. మూడు లక్షలకు ఒప్పందం కుదరినం కనే శవాన్ని పారేసింగ్రు. వాని భార్య ఏడుపు ఆపడం ఎవరి తరం కాలె. పిల్లలు మొకాలు జూసి కంట తడిపెట్టనోళ్లు లేరు. పోశవ్వ దిగులుతో పండు టాకులా వణికిపోయింది. ఏం గాదె గట్ల బయపడితె ఎట్లయితది. ఏదో నూట్లె ఒకడు ఆయుసు మూడి గట్లయితదిగాని అంటూ ధైర్యం చెప్పిండు కొడుకు. మరో వారం దినాలు ఉండి చిన్నకొడుకుకాడికి బయలుదేరింది పోశవ్వ. బొంబాయి మహానగరంలో అడుగు పెట్టగానే తను భూలోకంల ఉన్నదా లేక ప్రాణం పొయ్యి మరో లోకానికి వచ్చిందో అర్థం కాలె. ఏడ జూసినా జనం... మోటార్లు గడ్డి మొలిసినట్లు సందు లేకుండ.. ఏడ్నుంచి పుడుతున్నరు ఇంతమంది సీమల పుట్టలోలె అనుకున్నది.

కొడుకు పనిజేస్తున్న కంపెనీకి జేరుకున్నది. గేటుకాడ ఉన్నాయనను అడిగితె. ఆ కంపెనీల పని మానేసి శానా రోజులయిందని చెప్పిండు. చానాసేపు బ్రతిమాలితె వాళ్లుండే ఇంటి జాడ చెప్పిండు. ఆ ఇంటికిపోతె కోడలు ఒక్కతే ఉంది. మొఖంల మును పటి కళ లేదు. మనవడు పానం లేనట్లు ఉన్నడు. చానారోజులుగా జ్వరం వస్తున్నది. ఏందే గట్లున్నవ్ వీరయ్య లేడూ అనడిగితె పొడి పొడిగ జవాబు లిస్తున్నదే తప్ప విషయం చెప్పదు.

అడుగగా, అడుగగా చెప్పింది.

"నీ కొడుకు ఇంకోదాన్ని చూసుకొని వెల్లిపొయ్యిండు. ఏడున్నడో తెల్వదు." పోశవ్వగుండెల రాయి పడ్డది. "నా కొడుకు ఇంతపని చేసిండా, భార్యా బిడ్డల్ని వదిలేసి మరో ఆడదాని కొరకు వెల్లిండా."

"మరెట్లనే ఇట్ల ఊకుంటె అయితదే.... ఆదు ఏడున్నడో ఎతికి నిలదీసి అడుగొద్దా" అన్నది పోశవ్వ.

"ఏడున్నడని ఎతుకుతం... కావాలని పోయినోన్ని...అంత కాదన్నవాడ్ని పట్టుకొని నేనెందుకు ఏల్లాడాల.... మంచిగొచ్చినవు అత్తమ్మాఁ ! ఇగో నీ మనువన్ని నీవు తీస్కపో.... నా దారి నేను చూసుకుంట" అన్నది కోడలు. పోశవ్వకు మాటరాలె.

"ఇంకా మూడేండ్లు నిండని పసివాన్ని తీసుకొని తనుపోతె ఇది తనదారి తను చూసు కుంటదా. ఇదేం తల్లి..."

తెల్లారి లేచి చూస్తేకోడలు కనిపించలేదు. నోట్లో వ్రేలేసుకొని నిద్రపోతున్న పసివాడు. పొద్దెక్కినా కోడలి జాడ లేదు. పొద్దుగుంకి నా కోడలు ఇంటికి రాలె. చుట్టుప్రక్కల అందర్ని అడిగింది.

అది పిలగాడ్ని ఎట్ల వదిలిచ్చుకుందమా అని చూస్తున్నది ఇంతలోకి నీవొచ్చినవ్... ఇంక అది రాదు గాని మనవడ్ని తీసుకొని నీవు నీ ఊరికి పో అవ్వా. నీ కొడుకెప్పటికైనా నీ కాడికే వస్తడు అన్నరు ఇరుగు పొరుగు.

చూస్త చూస్త ఈ పసోడ్ని అనాధను చెయ్య గలదా. అలాగని ఈ వయసులో ఈ పసివాడి భారం మొయ్యగలదా. ఏమో.... కడుపున పుట్టిన బిడ్డలం దరు రెక్కలొచ్చి ఎగిరిపోతె ఆఖరుకు ఈరెక్కలు రాని పసివాడు నాకు మిగిలిండేమో.... తలా కొంత పైసలు వేసి టికెట్ కొనిచ్చి రైలెక్కిచ్చింగ్రు ఆ బస్తీలోల్లు.... పసివాడితో రైలెక్కింది పోశవ్వ. పడమటి దిక్కు ఆకాశంలో ఎర్రటి సూర్యుడు. పొద్దు పొడిచినా పొద్దుగూకినా ఎరుపెక్కే ఆకాశం. తూర్పు పడమర కలిసినట్లు అవ్వా మనుమల సమాగమం. నెల్లాల్లు అయెనేమో ఊరిడిచి... ఊరు పిలిచినట్లని పించింది పోశవ్వకు.

ధారలుగా కారుతున్న కన్నీళ్లను తన చిట్టి చేతులతో తుడుస్తున్న పసివాడ్ని గుండెలకు హత్తు కుంది.